

బతుకమ్మ ఆట తీరునే మార్చేశారు



రామగిరి: ఆనాడు బతుకమ్మ గంటల తరబడి ఆడుకునేది. వాడోళ్లందరం చప్పట్లు కొడుతూ పాటలు పాడేటోళ్లం. భక్తిశ్రద్ధలతో 9రోజులు బతుకమ్మ ఆడేవాళ్లం. ఇప్పుడు ఎక్కడ చూసినా డీజే పాటలు పెట్టుకుని ఎగురుతున్నారు. ఇప్పటోళ్లకు ఎగురుడు తప్ప ఆడుడు రాదు. బతుకమ్మ ఆట తీరునే మార్చేశారు. – గురుకుల సారమ్మ, నవాబ్‌పేట

ఊరంతా ఒకేచోట ఆడేవాళ్లం



యైటింక్లయిన్‌కాలనీ: మాకాలంలో బతుకమ్మ పండుగ వచ్చిందంటే కుటుంబంలోని ఆడబిడ్డలతో కలిసి ఊరంతా ఒకే చోట ఆడుకునేవాళ్లం. ఇప్పుడు వాడవాడల్లో చిన్న చిన్న ఏరియాలలో బతుకమ్మ ఆడుతున్నారు. డీజే పాటలతో ఆడుతున్నారు. అసలు బతుకమ్మ ఆడే పద్ధతినే మరిచిపోతున్నారు. – జంగ మల్లమ్మ, యైటింక్లయిన్‌కాలనీ

చప్పట్లు కొడుతూ..



నాకు వివాహమై ఇంకా ఏడాది కూడా కాలేదు. సద్దుల బతుకమ్మకు తల్లిగారింటికి వెళ్తేనే ఆనందంగా ఉంటుంది. నేను చిన్నప్పుడు తంగేడు పూలతో బతుకమ్మలు పేర్చి చప్పట్లు కొట్టుకుంటూ పాటలు పాడుతూ ఎంతో ఎంజాయ్ చేసేవాళ్లం. ఇప్పుడు డీజే పాటలకు, డ్యాన్సులతోనే వేడుకలు నిర్వహిస్తున్నారు. – తొడుపునూరి సాహితి, రామగుండం

క్లుప్తంగా

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు



సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న చెరువుల వద్ద సద్దుల బతుకమ్మ ఏర్పాటుతోపాటు నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బతుకమ్మ ఘాటు వద్ద మినీ లైట్స్‌తో పాటు చెరువు కట్ట వద్ద భారీ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటితో పాటు సమావేశం మందిరానికి అవసరమయ్యే ఏర్పాట్లను ముమ్మరం చేశారు. బతుకమ్మతో పాటు విజయదశమి, దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు వృత్తి విద్య అగ్రికల్చర్, ఇంటర్న్‌షిప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం వ్యవసాయ సాగుపై క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. విత్తన ఎంపిక, సస్యరక్షణ చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలు, నారుమడి, ఎరువులు, నీటి యాజయాన్య పద్ధతులపై వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య, అగ్రికల్చర్ ఉపాధ్యాయురాలు, సింధుజ, కోరమాండల్ గ్రోమోర్ సెంటర్ నిర్వాహకులు రాటైల్ స్టోర్ మేనేజర్ ఆకుల కిరణ్, కస్టమర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్ తిప్పారపు సాగర్ పాల్గొన్నారు.

బాపు చూపు సజీవం

కోల్‌సిటీ: గోదావరిఖని కళ్యాణ్‌నగర్ కు చెందిన కాంగ్రెస్ నాయకుడు కామ విజయ్‌కుమార్ తండ్రి కామ రాజలింగం(75) బుధవారం మరణించాడు. కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకారం తెలిపారు. సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. విజయ్‌కుమార్ తండ్రి మరణించిన విషయం తెలిసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ నేరుగా శ్మశాన వాటికకు వచ్చారు. అక్కడే నివాళి అర్పించారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటలో ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం పాఠశాల ఆవరణం శుభ్రం చేశారు. అనంతరం పాఠశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలను ప్రాజెక్టు ఆఫీసర్ నరహరితో జరుపుకున్నారు. అలాగే హన్మంతునిపేటలో ప్రభుత్వ బాలుర కాలేజీ వలంటీర్లు శ్రమదానం చేశారు. రోడ్లపక్కన ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, పీవో సదయ్యతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

27న బాపూజీ విగ్రహం ఏర్పాటు

సుల్తానాబాద్: జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని 27న ఏర్పాటు చేస్తామని పద్మశాలీ సంఘం నాయకురాలు దాసరి ఉష తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో బుధవారం పద్మశాలీలు సన్నాహక సమావేశం నిర్వహించారు. బాపూజీ 110వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తాలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల పద్మశాలీలు 27న నిర్వహించే భూమిపూజకు హాజరుకావాలని కోరారు. పద్మశాలీ నేతలు పెగడ పర్శరాములు, ఆడెపు అంబదాస్, సత్యనారాయణ శివ, మురళి, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

ఆలయంలో గోపూజ



ధర్మారం: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలోని గోశాలలో బుధవారం గోపూజ నిర్వహించారు. ఆలయ పూజారి బీవీ నర్సింగరావు, ఆలయ శాశ్వత చైర్మన్ తాటిపెల్లి ఈశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పనులు విడుదల చేయాలి

కాల్వశ్రీరాంపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలంలో చేసిన అభివృద్ధి పనుల జాబితా మీడియా ద్వారా ప్రజలకు స్పష్టం చేయాలని కాంగ్రెస్‌కు చెందిన ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య డిమాండ్ చేశారు. కాల్వశ్రీరాంపూర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌పై ఆరోపణలు చేసే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. వైస్‌చైర్మన్ సబ్బని రాజమల్లు, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, నాయకులు శివరామకృష్ణ, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి ఓ వరం

ఎలిగేడు: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడపిల్లలకు ఓ వరమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని శివపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన చేతుల మీదుగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 18మంది లబ్ధిదారులకు రూ.18లక్షల విలువగల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను దశలవారిగా పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. తహసీల్దార్ యాకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, దుగ్యాల సంతోష్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, రంగు శ్రీనివాస్‌గౌడ్, దేవరాజ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారి దర్శనం



పెద్దపల్లిరూరల్: చందపల్లిలో పూజలు



యైటింక్లయిన్‌కాలనీ: ఒడిబియ్యం పోస్తున్న మహిళలు



ఫెర్టిలైజర్‌సిటీ: పూజల్లో పాల్గొన్న భక్తులు



రామగుండం: అంబేద్కర్ విగ్రహ కూడలిలో..



రామగిరి: కల్వచర్ల కౌండన్య నగర్‌లో..



కమాన్‌పూర్: పేరపల్లిలో పూజల్లో పుట్ట మధు



ఎలిగేడు: పూజల్లో భక్తులు



జ్యోతినగర్: నర్రాశాలపల్లెలో..

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/ఫెర్టిలైజర్‌సిటీ/కమాన్‌పూర్/యైటింక్లయిన్‌కాలనీ/పాలకుర్తి/రామగుండం/రామగిరి/ఎలిగేడు/జ్యోతినగర్/కాల్వశ్రీరాంపూర్: శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మొదటగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ఒడిబియ్యంతో పాటు గాజులు, పూలు, పండ్లు సమర్పించారు.

సంక్షిప్త వార్తలు

• స్కానింగ్ సెంటర్ల తనిఖీ

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని పలు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లను డీఎంహెచ్‌వో వి.వాణీశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, ఫారం ఎఫ్‌లను పరిశీలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, చేయాలని కోరిన వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10వేల వరకు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ప్రతీనెల స్కాన్ సెంటర్స్ ఫారం-ఎఫ్‌లను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఇవ్వాలని ఆదేశించారు.

• రోడ్డు ప్రమాదంలో హోంగార్డ్‌కు తీవ్రగాయాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డ్ లక్ష్మీనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్‌కు చెందిన హోంగార్డ్ వడ్లూరి లక్ష్మీనారాయణ కరీంనగర్‌లోని ఆర్ఎఫ్‌సీఎల్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో తల, చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

• చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మారం: రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన దాసరి రాజశేఖర్ (34) పిల్లలు కావడం లేదని మనస్థాపం చెంది ధర్మారం మండలం పత్తిపాక గ్రామ శివారులో చెరువు కట్ట వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించినట్లు ధర్మారం ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పత్తిపాకలో ఉంటున్న పెద్దమ్మ కుమారుడు మోదుంపల్లి అంజయ్య ఇంటికి రాజశేఖర్ వచ్చాడు. కొంత సమయం తర్వాత గ్రామ శివారులోని చెరువు కట్ట వద్దకు వచ్చిన రాజశేఖర్ వెంట తెచ్చుకున్న గడ్డిమందు తాగాడు. గమనించిన బంధువులు చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

సుల్తానాబాద్: తెలుగు సబ్జెక్ట్‌లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన గట్టెపల్లికి చెందిన మానుపాటి సాయిలును సన్మానించారు. బుధవారం మండల కేంద్రంలో హనుమాన్ నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు.

• పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా మనాలిఠాకూర్

గోదావరిఖనిటౌన్: స్థానిక ఐబీకాలనీ పెద్దమ్మతల్లి, నాగదేవత సేవా ట్రస్ట్ దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా మక్కాన్‌సింగ్ సేవా సంఘం అధ్యక్షురాలు మనాలి ఠాకూర్‌ను నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సబ్బు మల్లయ్య తెలిపారు. అలాగే జంగంపల్లి శ్రీనివాస్, సుంక లింగమూర్తిని ముఖ్య సలహాదారులుగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

• నేడు పీఎల్‌ఆర్ బోనస్‌పై సమావేశం

గోదావరిఖని: దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గుగని కార్మికులకు చెల్లించే పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు (పీఎల్ఆర్), దీపావళి బోనస్‌పై గురువారం జేబీసీసీఐ సమావేశంలో 25న కోల్‌కతాలో నిర్వహించనున్నారు. జాతీయ కార్మిక సంఘాల నాయకులు బయలుదేరి వెళ్లారు. చాలా ఏళ్ల తర్వాత మొదటిసారిగా ఐఎన్‌టీయూసీ నుంచి జనక్‌ప్రసాద్ ఈ చర్చల్లో పాల్గొననున్నారు.

• పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జూలపల్లి: జీఎస్టీ తగ్గింపుతో సామాన్య, పేద ప్రజలకు మేలు జరుగుందని బీజేపీ నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ ప్రచార అభియాన్ జిల్లా కన్వీనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు.

• పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి: మంథని జేఎన్టీయూ కళాశాలలో 25న నిర్వహించనున్న అంతర్గత హ్యాకథాన్ పోస్టర్‌ను బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ బులుసు విష్ణువర్ధన్ ఆవిష్కరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో భాగంగా మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు అంతర్గతంగా పోటీలు నిర్వహించి ఉత్తమంగా ఎంపికైన విద్యార్థులను రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

• ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఎన్ఎస్ఎస్ అధికారి దామరకొండ శంకర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) జె.అరుణశ్రీ, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి డి.కల్పన హాజరయ్యారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాలుర కళాశాల ప్రిన్సిపాల్ సంజీవయ్య, బాలికల కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేందర్ పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

ముత్తారం: ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశం మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు.

రైల్వేకాలనీలో స్వచ్ఛభారత్



స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ

రామగుండం: స్వచ్ఛ భారత్-స్వచ్ఛ రైలు కార్యక్రమంలో భాగంగా బుధవారం రామగుండం రైల్వే కాలనీలో ఇంటింటా పారిశుధ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలనీలో పరిశుభ్రత-ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై రైల్వే ఉద్యోగ కుటుంబాలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ పాతూరి రాజిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ డి.సంజయ్‌కుమార్, కార్మికులు రాధిక, జ్యోతి, ప్రమీల, లక్ష్మి, పద్మ, రాజేశ్వరి, మల్లేశం, శంకర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్యశిబిరం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యులు లూబినా, శ్రీనిధి, సల్మా బేగం, ఏఎన్ఎం భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు 15శాతం బోనస్ చెల్లించండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి లాభాల్లో 15శాతం బోనస్ సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించాలని బుధవారం ఆర్జీ-2 ఏరియా పర్సనల్ మేనేజర్ వంశీకి సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. బుచ్చమ్మ, లక్ష్మి, రామ, లావణ్య, భవానీ, సదానందం పాల్గొన్నారు.

30 ఇళ్లకు కరెంట్ కట్

ముత్తారం: మండలంలోని పారుపల్లిలో బిల్లులు చెల్లించ లేదని 30ఇళ్లకు కరెంట్ కట్ చేశారని బాధితులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ పూట బిల్లులు చెల్లించలేమని, కాస్త సమయం ఇవ్వాలని కోరినా వినకుండా కరెంట్ కట్ చేయడంతో చీకట్లో ఉంటున్నామని ఆదోళన చేశారు. పండుగైతే తమకేంటి అని బిల్లులు చెల్లించకపోతే కట్ చేయడమే తమ పని అని ట్రాన్స్‌కో అధికారులు వెళ్లిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు కట్టడానికి సమయం ఇచ్చి కరెంట్ పునరుద్ధరణ చేయలని బాధితులు కోరుతున్నారు.

రక్తదానం.. ప్రాణదానం

రామగిరి: రక్తదానం ప్రాణదానంతో సమానమని మంథని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డా.బులుసు విష్ణువర్ధన్ అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్వయంగా రక్తదానం చేసి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. శిబిరంలో 102 మంది విద్యార్థులు రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్‌కుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్‌రెడ్డి, డిస్పెన్సరీ ఇన్‌చార్జి రమేశ్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో భారీ వర్షం



సుల్తానాబాద్: మండల కేంద్రంలో భారీ వర్షానికి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బుధవారం పలు ప్రాంతాల్లో రాత్రి ఒకేసారి భారీ వర్షం కురవడంతో రోడ్లపై నీరు వచ్చి చేరాయి. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వచ్చి చేరాయి. పలు కాలనీల్లో కరెంటు సరఫరా నిలిపివేశారు. వర్షం తగ్గుముఖం పట్టడంతో పునరుద్ధరించారు.

బెల్లంలో అంబర్ గుట్కా

పెద్దపల్లిరూరల్: పట్టణంలో దుర్గాదేవికి నైవేద్యం కోసం భక్తులు తెప్పించిన బెల్లం ముద్దలో అంబర్ ప్యాకెట్ ప్రత్యక్షమైంది. కంగుతిన్న భక్తులు కరుణాకర్ తదితరులు ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

కార్పొరేట్ వర్క్‌షాప్ జీఎంకు సన్మానం



గోదావరిఖని: సన్మానిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: కార్పొరేట్ వర్క్‌షాప్ జీఎంగా పనిచేస్తూ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న ఫిట్జ్రాల్ జేసురత్నంను బుధవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జేసురత్నంను ఆర్జీ-1 జీఎం సన్మానించారు. అధికారులు ఆంజనేయులు, రాంమోహన్‌రావు, జితేందర్‌సింగ్ పాల్గొన్నారు.

రామగిరి: కార్పొరేట్ వర్క్‌షాప్స్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఫిట్జరాల్డ్ జేసురత్నంను బుధవారం జీఎం కార్యాలయంలో సన్మానించారు. ఆర్జీ-3, ఏపీఏ జనరల్ మేనేజర్లు సుధాకర్‌రావు, కొలిపాక నాగేశ్వరరావు, ఏరియా ఇంజినీర్లు వై.వి.శేఖరబాబు, కె.యాదయ్య, ఎస్‌వోటూ జీఎం బండి సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు సీహెచ్ వెంకటరమణ, ప్రవీణ్ వి ఫాటింగ్, విభాగాధిపతులు రాజారెడ్డి, బి.సుదర్శనం, ఐలయ్య, షబ్బీరుద్దీన్, రాజేశ్వరి, మేఘన, మనోజ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా ప్రమాణాలపై అవగాహన అవసరం



విద్యార్థుల మానవహారం

కోల్‌సిటీ: స్వచ్ఛతా ప్రమాణాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, శానిటరీ జవాన్ అశోక్, ఎకో వారియర్స్ ప్రతినిధులు శివకష్ణ, కరుణాకర్, మహేందర్, అధ్యాపకులు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

ధర్మారం: గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం పెద్దపల్లి జిల్లా మహాసభలు నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కార్మికులు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం మార్కెట్ యార్డుకు చేరుకుని సీఐటీయూ జెండా ఎగురవేశారు. సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా, జిల్లా ఉపాధ్యక్షుడు లచ్చయ్య, అశోక్, జిల్లా కమిటీ సభ్యుడు గంగాధర్, రవికుమార్, భాస్కర్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు టెలీ కమ్యూనికేషన్‌పై ఇంటర్న్‌షిప్

ధర్మారం: మండలంలోని నందిమేడారం బాలుర గురుకులం విద్యాలయంలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా టెలికమ్యూనికేషన్ విద్యకు సంబంధించిన శిక్షణను జగిత్యాల బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో తీసుకుంటున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కమ్యూనికేషన్ సిస్టమ్ గురించి, టెలికాంలో ఉపయోగించే ఫైబర్ ఆప్టిక్స్, సిగ్నల్ సిస్టం గురించి పదిరోజులు శిక్షణ తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వృత్తి విద్య టెలీ కమ్యూనికేషన్ ఉపాధ్యాయురాలు బొమ్మగాని రేణుక పాల్గొన్నారు.



శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న ఎంఈవో సురేందర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయినాథ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థిని ఎంఈవో సురేందర్‌కుమార్, హెచ్ఎం పురుషోత్తం, పీఈటీ సురేందర్ అభినందించారు. పట్టణంలోని రైజింగ్‌సన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సలాకపురం సహస్ర రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. 14న జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జూనియర్ బాలికల విభాగంలో పాల్గొన్న సహస్ర రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని కరస్పాండెంట్ సయిద్ అహ్మద్ తెలిపారు. 25నుంచి 28వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. హెచ్ఎం హకీం అభినందించారు. గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సింధు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. కరస్పాండెంట్ రజనీదేవి, అల్లెంకి శ్రీనివాస్ అభినందించారు.

కాంట్రాక్టు కార్మికులకు 15శాతం బోనస్ చెల్లించాలి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో 15శాతం వాటా చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు బి.అశోక్, బుచ్చమ్మ, లక్ష్మి, లావణ్య, భవాని, సదానందం ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈలో విద్యాబోధన ప్రారంభించిన నేపథ్యంలో బుధవారం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి వెంకటాచారి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి

రామగిరి: ప్రతీ విద్యార్థి జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డా.బులుసు విష్ణువర్ధన్ అన్నారు. బుధవారం భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, మేరా యువ భారత్, రామగిరి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు మండలాల బ్లాక్ స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్‌కుమార్, మైభారత్ జిల్లా ఇన్‌చార్జి మహేశ్‌కుమార్, పరిపాలనాధికారి సుమన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, జి.సునీల్ కుమార్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌పాల్ పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన

గోదావరిఖనిటౌన్: జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగిస్తే కలిగే నష్టాలపై స్థానిక ప్రధాన చౌరస్తాలో బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం గాంధీ చౌక్ నుంచి ఓల్డ్ అశోక థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, ఎల్సీపీఓ రజిత, డీహెచ్ఈడబ్ల్యూ అరుణ, ఐసీపీఎస్ శ్రీనివాస్, సతీశ్, అడిక్షన్ సెంటర్ ఇన్‌చార్జి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు కార్యక్రమం ప్రారంభం

ఎలిగేడు: రైతులు తమ వ్యవసాయ భూముల్లో సాగుచేసిన పంటల వివరాలు, సర్వే నంబర్ వివరాలను నమోదు చేసుకోవాలని ఏవో ఉమాపతి సూచించారు. మండలంలోని పంటల నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన చేపట్టారు. రైతులు తమ పంటల వివరాలు, సర్వే నంబర్, సబ్ డివిజన్ వారిగా ఏఈవోల దగ్గర నమోదు చేసుకోవాలన్నారు. ఏఈవో గణేశ్, రైతులు పాల్గొన్నారు.

వర్షం ధాటికి కూలిన ఇంటిగోడ

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామానికి చెందిన రావుల పున్నం పూరి గుడిసె బుధవారం కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి మట్టిగోడలు కావడంతో పూర్తిగా తడిసిపోవడంతో కూలిపోయాయి. గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు ఇదివరకే అర్జీలు పెట్టుకున్నప్పటికీ మంజూరు కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని అతను వేడుకుంటున్నాడు.